క్లుప్తంగా

వేపచెట్టుకు పూజలు


సత్తెమ్మతల్లి ఆలయం వద్ద వేప చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కుంచమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల ఆలయ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం కుంచమాంబ ఆలయం సమీపంలో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయం వద్ద వేపచెట్టు నాటి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పెదగంట్యాడ: స్థానిక 11కేవీ పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనుండడంతో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంట్యాడ ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియాలో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా శ్రీరామ పాదుకల ప్రతిష్ట


శ్రీరామ పాదుకలను ప్రతిష్టిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి కళింగవీధిలోని శ్రీ సాయినాథ, గణపతి సహిత కోదండ రామాలయంలో లోక కల్యాణార్థం శ్రీరామ పాదుకల ప్రతిష్ట మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ శ్రీ సీతారామాంజనేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా కలశ పూజ, హోమం, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరామ పాదుకలను ప్రతిష్టించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రగడ వేణుబాబు, ప్రగడ శంకరరావు, ప్రగడ శ్రీనివాస, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు శిక్ష

మల్కాపురం: గతేడాది స్థానిక జవహర్‌నగర్ వద్ద జరిగిన చోరీ కేసులో పట్టుబడిన వ్యక్తికి ఏడాది జైలు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ మూడో ఏసీఎంఎం మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి మల్కాపురం సీఐ లూథర్‌బాబు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్ లో మారుబిల్లి లక్ష్మీ అనే మహిళ తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. అయితే గతేడాది ఈమె ఇంట్లో రాగోలు నిషాంత్(అలియాస్ సొట్టా) అనే వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డాడు. తులంన్నర బంగారు ఆభరణం,విలువైన వెండి వస్తువులను దొంగలించాడు. దీంతో ఆమె క్రైం పోలీసులను ఆశ్రయించింది. దీనిపై హార్బర్ క్రైం సీఐ ఎ.అవతారం ఆదేశాలతో ఏఎస్ఐ శ్రీరామ్ దర్యాప్తు చేశారు. దొంగతనానికి పాల్పడ్డ నిషాంత్ ఇందిరాకాలనీ ప్రాంత వాసి అని గుర్తించారు. దీంతో ఆ వ్యక్తిని అరెస్టు చేసి బంగారం,వెండి వస్తువులు స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో మూడో ఏసీఎంఎం మెజిస్ట్రేట్ ఈ.రాజేంద్రబాబు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు.

వెంకన్నకు చందన అభిషేకం

సింహాచలం: వెంకటాద్రిపై శుక్రవారం వేంకటేశ్వరస్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి చందన అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు

పెదగంట్యాడ: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంవీఎస్ అన్నపూర్ణ అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ నివారణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 2025 నాటికి టీబీ రహిత దేశంగా చూడాలన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు, సాయంత్రమైతే జ్వరం రావడం, ఛాతి నొప్పి, బరువు తగ్గడం వంటివి టీబీ లక్షణాలని వివరించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దేశ్వరం వైద్యాధికారి డాక్టర్ మానస, తనకాల సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి బాధితులకు లీ ఫార్మా బాసట

అగనంపూడి: దువ్వాడ బీఎస్ఈజెడ్ ఆవరణలో లీ ఫార్మా కంపెనీ టీబీ బాధితులకు అండగా నిలిచింది. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వంద మంది టీబీ బాధితులకు పోషకాహారంతోపాటు పోషకాలతో కూడిన మందుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి చేతుల మీదుగా కిట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్షయ బాధితులు పోషకాహారం తీసుకుంటే వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటుందన్నారు. అందుకే బాధితులకు సంస్థ తరఫున సహాయం చేయడానికి ముందుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ఔషధ నియంత్రణ మండలి అధికారి చంద్రశేఖర్, ఫార్మా కంపెనీ అధికారులు పాల్గొన్నారు.


క్షయ వ్యాధి బాధితులకు కిట్లు అందజేస్తున్న లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి

‘దేశ ప్రజలే తగిన బుద్ధి చెబుతారు’


కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎన్నో కార్మికుల కుటుంబాలు ఆధారపడి ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే దేశ ప్రజలే కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 771వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బడా బాబుల బ్యాంకుల రుణాలను మాఫీ చేసే కేంద్ర ప్రభుత్వం, పైసాతో సహా తీసుకున్న రుణాలకు వడ్డీలు కడుతున్న స్టీల్ ప్లాంట్ రుణాలను మాఫీ చేయకపోగా, రా మెటీరియల్స్ కొనుక్కోవడానికి అదనపు రుణాలు పొందేందుకు అనుమతి లేకుండా అడ్డుపడడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మనోజ్ తివారీకి స్వాగతం

గాజువాక: విశాఖలో నిర్వహించనున్న సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలకు హాజరైన బోజ్‌పురీ దబాంగ్ టీం కెప్టెన్, ఎంపీ మనోజ్ తివారీకి బీజేపీ గాజువాక నాయకులు విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. క్రికెట్‌లో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు శంకరరావు, సుబ్రహ్మణ్యం, లలిత్ గౌర్, ఆర్‌పీ సింగ్ తదితరులు స్వాగతం పలికారు.

చట్టాలపై పోలీసులకు అవగాహన ముఖ్యం

విశాఖ, లీగల్ : పోలీసులు పౌర,నేర శిక్ష స్మృతి పరిధిలోని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయసేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులు– చట్టాలు అన్న అంశంపై జరిగిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. నేరంతో ప్రమేయంలేని అమాయకులను అరెస్టు చేస్తే తీవ్రమైన శిక్షకు గురికావలసి వస్తుందని హెచ్చరించారు. నిత్యం చట్టాలపై మూల్యాంకనం అవసరమన్నారు. వివిధ చట్టాలను వివరించారు. న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ మాట్లాడుతు పోలీసులు లోక్‌అదాలత్ సేవలను తెసుసుకోవాలన్నారు. మోటారు వాహన చట్టాలు, పరిహారం చెల్లింపు, బాలనేరస్తుల చట్టాలు అన్న అంశాలపై న్యాయసేవా ప్రాధికార సంస్థ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, నగరంలోని అన్ని పోలీసు స్టేషన్లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వడివడిగా సంద్రం వైపు...

- పెదనాగమయ్యపాలెం వద్ద సముద్రంలోకి 640 తాబేలు పిల్లలు


పెదనాగమయ్యపాలెం వద్ద సముద్రంలోకి వడివడిగా కదులుతున్న తాబేలు పిల్లలు


తాబేళ్లను ఉంచిన బుట్టలతో మత్స్యకారులు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం తీరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షించిన తాబేలు గుడ్లు పిల్లలుగా మారడంతో శుక్రవారం ఉదయం పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం మత్స్యకారులు, పంచాయితీ పెద్దల ఆధ్వర్యంలో సముద్రంలోకి వదిలారు. సముద్ర ఘోష వినిపించిన వైపు తాబేలు పిల్లలు వడివడిగా సాగిపోయాయి. స్థానిక మత్స్యశాఖ ప్రతినిధులు తోట ముసలయ్య, గరికిన లక్ష్మణ, దూడ ధనంకొండ తదితరులు మాట్లాడుతూ తీరంలో తాబేళ్ల గుడ్లు పెట్టిన తర్వాత మత్స్యకారులు ఇసుకలో అడుగున్నర లోతు తవ్వి సేకరిస్తారన్నారు. ప్రత్యేకంగా వెదురు కర్రలతో తడికెలు నిర్మించి వాటిని భద్రపరుస్తారన్నారు. దీనివల్ల పక్షులు, ఇతర జంతువుల బారినపడకుండా ఉంటాయన్నారు. 50 రోజుల తర్వాత గుడ్ల నుంచి పిల్లలు బయటకు వచ్చిన తర్వాత సూర్యోదయం వేళ బుట్టల్లో భద్రంగా తీసుకొచ్చి తీరంలో వదిలితే అలల శబ్దానికి వడివడిగా తాబేళ్లు సముద్రంలో కలసిపోతాయన్నారు. శుక్రవారం 640 తాబేలు పిల్లలను సముద్రంలో వదిలినట్టు వారు తెలిపారు. ఇంకా మరిన్ని గుడ్లు తీరంలో ఉన్నాయని తెలిపారు.

మస్తానప్పకు అభినందనలు

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్పను యూనియన్ నాయకులు అభినందించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధిష్టానం మస్తానప్పను పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద మస్తానప్పకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మస్తానప్ప మాట్లాడుతూ పార్టీ అనుబంధ విభాగాల్లో వైఎస్సార్‌టీయూసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, జి.అప్పలరాజు, పిట్టారెడ్డి, డి.పుల్లారావు, జి.నూకరాజు, రామయ్య, జగదీశ్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా


కంచరపాలెంలో ప్రభుత్వ ఉపాధి కార్యాలయం

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఉపాధి కార్యాలయం(క్లరికల్) ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక జరగనుందన్నారు.


ఇవీ వివరాలు..

- హెటిరోల్యాబ్స్ లిమిటెడ్‌లో 200 జూనియర్ కెమిస్ట్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి 20–26 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు రూ.22,800 జీతం ఇస్తారు.
- పాలగాని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు కంపెనీలో 30 ప్రాసెస్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ/ పీజీ/ఏదైనా డిప్లొమా అర్హత కలిగి 20–25 ఏళ్ల లోపు వయసు ఉండాలి. నెలకు రూ.12,000 జీతం ఉంటుంది.
- స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్(సీతంపేట–విశాఖపట్నం)లో 20 టెలీకాలర్స్, 20 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, 20 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, 25 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు జీతం రూ.12,000.
- క్లోవ్ టెక్నాలజీస్‌లో 15 ఆటో క్యాడ్ పోస్టులకు బీటెక్(సీఎస్ఈ), 22–27 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు అర్హులు. జీతం 13,500. ఇదే సంస్థలో డిప్లొమా లేదా ఏదైనా బీటెక్ చేసిన వారికి డెవలపర్స్ ఉద్యోగానికి అవకాశం ఉంది. నెలకు రూ.13,500 జీతం ఉంటుంది.
- పేజెస్ సంస్థలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, డాటా సోర్సింగ్, కమ్యూనికేషన్ పోస్టులను భర్తీ చేస్తారు. సైన్స్ డిగ్రీ/బీ ఫార్మసీ/ఎం ఫార్మసీ/బీఎస్సీ/ఎంఎస్సీ/బీటెక్ కంప్యూటర్స్ కోర్సులు చేసి 30 ఏళ్ల వయసు లోపు ఉన్న వారు అర్హులు. విశాఖలో రూ.16,000, హైదరాబాద్‌లో రూ.18,000 జీతం ఇస్తారు.
- ట్రస్ట్ సర్వీసెస్‌లో ఫిట్టర్, వెల్డర్, ఫ్యాబ్రికేట్, గ్రైండర్స్ హెల్పర్స్ 10 పోస్టులకు ఐటీఐ చదివి 18–48 ఏళ్ల వయసు గల వారు అర్హులు. నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు జీతం ఉంటుంది.
- సువర్ణభూమి సంస్థలో మార్కెటింగ్ మేనేజరు పోస్టుకు బీటెక్/ఎంబీఏ అర్హత కలిగి 18–36 ఏళ్ల వయసు గల వారిని తీసుకుంటారు. పది పోస్టులు ఉన్నాయి. నెలకు రూ.17,000 జీతం. ఇదే సంస్థలో 10 టెలికాలర్ ఉద్యోగాలకు 18–36 ఏళ్ల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జీతం రూ.9,000. అభ్యర్థులు నేరుగా కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయానికి శనివారం ఉదయం 10 గంటలకు హాజరు కావచ్చు. ఆసక్తి గల వారు ncs.gov.in లో పేర్లు నమోదు చేసుకోవాలి.

వేలం ద్వారా రూ. 10.71 లక్షల ఆదాయం


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం నెల కాలపరిమితికి శుక్రవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.10 లక్షల 71వేలు ఆదాయం లభించింది. కొండదిగువ భైరవస్వామి ఆలయం వద్ద పూజాసామగ్రి, కొబ్బరికాయలు విక్రయానికి రూ. 4.90లక్షలు, సింహగిరిపై భక్తుల సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరిచేందుకు రూ. 3.52లక్షలు, కొండపైన, కొండదిగువ ఐస్‌క్రీమ్ విక్రయాలు జరిపేందుకు రూ.1.58లక్షలు, గోపాలపట్నంలోని దేవస్థానం స్థలంలో బుధవారం జరిగే సంతలో ఆశీలు వసూలు చేసుకునేందుకు రూ.10,800కి, బుధవారం మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలుకు రూ.11వేలకు, వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయానికి రూ.50 వేలకు పాట దారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవోలు ఇజిరోతు శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు తదితరులు ఈ వేలం పాటలు నిర్వహించారు.

ట్రాన్స్‌పోర్టు లారీలకు జీపీఎస్ వ్యవస్థ తప్పనిసరి


లారీ యజమానులతో సమావేశమైన డీసీపీ ఆనందరెడ్డి

అల్లిపురం: ట్రాన్స్‌పోర్టు లారీలన్నింటిలో తప్పనిసరిగా జీపీఎస్ వ్యవస్థ అమర్చాలని, లోడింగ్ పాయింట్ నుంచి గమ్యస్థానం చేరేంత వరకు సంబంధిత లారీ ట్రాన్స్‌పోర్టు వారు సదరు లారీల ట్రాకింగ్ డేటా భద్రపరచాలని జోన్–2, డీసీపీ కె. ఆనందరెడ్డి కోరారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన లారీ ట్రాన్స్‌పోర్టు సంఘాల యాజమాన్యాలతోను, స్టీవ్ డోరింగ్ కంపెనీల ప్రతినిధులతో పోర్టుట్రస్ట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టుట్రస్ట్ కేటాయించిన యార్డుల్లో సంబంధిత సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, కంపెనీ యాజమాన్యాలు సూపర్‌వైజర్లను, సెక్యూరిటీ గార్డులను నియమించుకునే క్రమంలో ఆయా సంస్థలు గత చరిత్ర, నేరచరిత్రను తప్పక పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్టీవ్ డోర్స్ కంపెనీ వారు జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే లోడింగ్‌కు అనుమతించాలని కోరారు. పోర్టులో షిప్ నుంచి లోడ్ అన్‌లోడ్ చేసిన మెటీరియల్ యార్డ్‌కు పంపించే సమయంలో ప్రతి లారీకి రోడు అందించి అన్‌లోడ్ అయిందా లేదా అని తనిఖీ చేసుకోవాలన్నారు. వేయింగ్ బ్రిడ్జి వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని యజమానులకు తెలిపారు. ఈ సమావేశంలో హార్బర్ ఏసీపీ, హార్బర్ సీఐ, పోర్టు ట్రస్ట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్గొన్నారు.

నేల బావిలో దిగి విద్యార్థి మృతి


సాయి కళ్యాణ్ (ఫైల్)

కూర్మన్నపాలెం: స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొడదామని వెళ్లిన ఓ ఇంటర్ విద్యార్థి నేలబావిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్ దరి చట్టివానిపాలెం ప్రాంతానికి చెందిన మోకానిక్ జె.శివప్రసాద్, భార్య, కుమారుడు సాయికల్యాణ్(16), కూతురుతో నివాసముంటున్నాడు. సాయికల్యాణ్ ప్రస్తుతం గాజువాకలోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మ్యాథ్స్ పరీక్ష రాసి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. సాయంత్రం 3 గంటలకు తన స్నేహితులు పాల్గుణ, లోకేష్ రెడ్డి, లోహిత్‌లతో కలిసి కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల వెనక ఉన్న నేలబావిలో ఈత కొట్టడానికి దిగారు. ముందుగా సాయికల్యాణ్ నీటిలో దూకాడు. వెంటనే ఊబిలో కూరుకుపోయాడు. దీంతో అక్కడే ఉన్న గజ ఈతగాడి సాయంతో నేలబావిలో కూరుకుపోయిన సాయికల్యాణ్‌ను పైకి తీసుకువచ్చారు. అయితే అప్పటే ఆయన ప్రాణాలు విడిచాడు. విషయం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కాంట్రాక్టు కార్మికులకు బాసట


కాంట్రాక్టు కార్మికునికి వస్తువులు అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ విభాగంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్టు కార్మికులకు విభాగం ఉద్యోగులు సాయం అందించారు. కోక్ ఓవెన్స్ విభాగంలోని టార్ డిస్టిలేషన్ ప్లాంట్ (టీడీపీ) ట్యాంకర్‌పై పని చేస్తుండగా జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికులు పరమేష్, ఏకాశి, నగేష్ తీవ్రంగా గాయపడ్డారు. విభాగం జీఎం జి.బి.శ్రీనివాస్, డీజీఎం సీహెచ్.శ్రీనివాసరావు నేతృత్వంలో సీసీపీ మెకానికల్ ఉద్యోగులందరూ కలిసి విరాళాలు సేకరించారు. ఆ నిధులతో అవసరమైన చికిత్స చేయడంతోపాటు బియ్యం, నూనె, నిత్యావసర సరకులు కొనుగోలు చేశారు. విభాగం కార్మిక సంఘ నాయకులు కొమ్ము ప్రసాదరావు, శివరామకృష్ణ, కనకరాజు, హనుమంతరావు బాధితులకు వాటిని అందజేశారు. ఉద్యోగుల సాయంపై కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

విజ్ఞాన్ విద్యార్థుల సాంకేతిక ప్రదర్శన



సాంకేతిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

గాజువాక : విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఈసీఈ, ఈఈఈ విభాగం విద్యార్థులు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. ఈపీఎల్ ఇగ్నైట్ – 2కే 23 ఎనలైటనింగ్ లిటిల్ మైండ్స్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్, లైవ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించి విద్యార్థులకు వివిధ అంశాలను వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు, వెజిటబుల్ హార్వెస్ట్ ప్రాజెక్టు, బ్లూటూత్ కంట్రోల్ వెహికల్, పవర్ కాలిక్యులేషన్ పోస్టర్, ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ డిస్‌ప్లే తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. చక్కటి ఎగ్జిబిట్స్‌తో కార్యక్రమం నిర్వహించిన విద్యార్థులను కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎం.కరుణ, కో ఆర్డినేటర్లు ఎం.వి.జి.వరప్రసాద్, ఇ.వి.వి.సుబ్బారావు, ఈసీఈ, ఈఈఈ విభాగాధిపతులు బి.ప్రసాదరావు, కె.స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డీఐసీ జీఎం గణపతి

అక్కిరెడ్డిపాలెం: బ్యాంక్ లావాదేవీలపై కార్మికులు అవగాహన కలిగి ఉండాలని డీఐసీ జీఎం సీహెచ్. గణపతి సూచించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని కార్మికులకు ఆర్థిక లావాదేవీలపై విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ అధికారులు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు లేబర్ కమిషన్ ద్వారా మీ శ్రమ్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. దీంతో కార్మికులు ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ నగదు బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. నగరంలో త్వరలో జరగనున్న జి – 20 శిఖరాగ్ర సమావేశంలో ఆర్‌బీఐ భాగస్వామ్యంతో పాల్గొంటుందన్నారు. బ్యాంక్ ఖాతాల్లో పొదుపు, ప్రణాళిక, డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం నాగప్రవీణ్, అంజనేయులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శర్మ, ఆర్‌బీఐ అధికారి రోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓబీసీ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం


స్టీల్ ఓబీసీ కార్యాలయం వద్ద కార్యక్రమంలో నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కార్యాలయం వద్ద ఓబీసీ లైజన్ ఆఫీసర్ గంటా అప్పారావు జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం అసోసియేషన్ పని చేస్తుందన్నారు. సభ్యత్వ నమోదు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం ట్రైనింగ్ విభాగం వద్ద ఓబీసీ సంఘం సీనియర్ నాయకులు జి.ఆర్.కె.నాయుడు జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఎల్.నాయుడు, కోశాధికారి యు.శ్రీనివాస్, ఆర్.వి.నారాయణ, జి.ఆర్.కె.నాయుడు, కామేశ్వరరావు, పిల్లి చంద్రరావు, జి.అప్పలరాజు, ఎం.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నాటకాలు సంప్రదాయాలకు ప్రతీకలు

- వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల
- అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం


సామవేదం బాలసుబ్రహ్మణ్యం దంపతులను సత్కరిస్తున్న నాయకులు


నాటకం ప్రదర్శనలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: పౌరాణిక నాటకాలు మన సనాతన సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతికలుగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా పంచకర్ల రమేష్‌బాబు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, అసోసియేషన్ అధ్యక్షుడు కురిటి సత్యంనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ నాటకాలను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు. అనంతరం ప్రదర్శించిన నాటకంలో వీరబాహుడుగా వైఎస్సార్‌సీపీ కల్చరల్ వింగ్ జోనల్ కన్వీనర్ వంకాలయ మారుతీప్రసాద్ తన నటనా కౌశలంతో ప్రేక్షకులు హృదయాలను గెలుచుకున్నారు. రంగస్థల సీనియర్ కళాకారుడు సామవేదం బాలసుబ్రహ్మణ్యం దంపతులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు శ్రీదేవివర్మ, రాధ, తదితరులు పాల్గొన్నారు.